11-05-2024 ప్రాత:మురళి ఓంశాంతి ''బాప్ దాదా'' మధువనం

"మధురమైన పిల్లలూ - మీకు ఇప్పుడు అల్లా లభించారు కావున సరియైన వారిగా అవ్వండి అనగా స్వయాన్ని ఆత్మగా భావించండి, దేహముగా భావించడము అంటేనే తలక్రిందులుగా అవ్వడము"

ప్రశ్న:- ఏ ఒక్క విషయాన్ని అర్థం చేసుకునేవారు అనంతమైన వైరాగులుగా అవ్వగలరు?

జవాబు:- పాత ప్రపంచము ఇప్పుడు హోప్ లెస్ గా (నిరాశాజనకంగా) ఉంది, ఇది స్మశానవాటికగా అవ్వనున్నది, ఈ విషయాన్ని అర్థం చేసుకున్నట్లయితే అనంతమైన వైరాగులుగా అవ్వగలరు. ఇప్పుడు కొత్త ప్రపంచము స్థాపన అవుతోందని మీకు తెలుసు. ఈ రుద్ర జ్ఞాన యజ్ఞంలో మొత్తం పాత ప్రపంచమంతా స్వాహా అవ్వనున్నది. ఈ ఒక్క విషయమే మిమ్మల్ని అనంతమైన వైరాగులుగా చేస్తుంది. మీ హృదయం ఈ స్మశానవాటిక నుండి తొలగిపోయింది.

ఓం శాంతి. వాస్తవానికి ఇది డబుల్ ఓం శాంతి ఎందుకంటే ఇద్దరు ఆత్మలు ఉన్నారు. ఇరువురి ఆత్మల స్వధర్మమూ శాంతియే. తండ్రి స్వధర్మము కూడా శాంతియే. పిల్లలు అక్కడ శాంతిలో ఉంటారు, దానిని శాంతిధామము అని అంటారు. తండ్రి కూడా అక్కడే ఉంటారు. తండ్రి అయితే సదా పావనులు. మిగిలిన మనుష్యమాత్రులు ఎవరైతే ఉన్నారో వారు పునర్జన్మలు తీసుకొని అపవిత్రులుగా అవుతారు. పిల్లలూ, స్వయాన్ని ఆత్మగా భావించండి అని తండ్రి పిల్లలకు చెప్తారు. పరమపిత పరమాత్మ జ్ఞానసాగరుడని, శాంతిసాగరుడని ఆత్మకు తెలుసు, వారికి ఈ మహిమ ఉంది కదా. వారు సర్వులకు తండ్రి మరియు సర్వుల సద్గతిదాత కూడా. కావున అందరికీ తండ్రి వారసత్వముపై హక్కు తప్పకుండా ఉంటుంది. తండ్రి నుండి ఏ వారసత్వము లభిస్తుంది? తండ్రి స్వర్గ రచయిత కావున తప్పకుండా స్వర్గ వారసత్వాన్నే ఇస్తారు మరియు అది కూడా తప్పకుండా నరకములోనే ఇస్తారని పిల్లలకు తెలుసు. నరకము యొక్క వారసత్వాన్ని ఇచ్చింది రావణుడు. ఈ సమయంలో అందరూ నరకవాసులుగా ఉన్నారు కదా. కావున తప్పకుండా ఈ వారసత్వం రావణుడి నుండే లభించింది. నరకము మరియు స్వర్గము, రెండూ ఉన్నాయి. ఈ విషయాలను ఎవరు వింటారు? ఆత్మ. అజ్ఞానకాలములో కూడా అంతా ఆత్మయే చేస్తుంది, కానీ దేహాభిమానం కారణంగా అంతా శరీరమే చేస్తుంది అని భావిస్తారు. మన స్వధర్మం శాంతి అన్నది మర్చిపోతారు. మనం శాంతిధామ నివాసులము. సత్యఖండమే మళ్ళీ అసత్యఖండముగా అవుతుంది అని కూడా అర్థం చేయించాలి. భారత్ సత్యఖండముగా ఉండేది, మళ్ళీ రావణ రాజ్యముగా, అసత్య ఖండముగా కూడా అవుతుంది. ఇది సామాన్యమైన విషయము. దీనిని మనుష్యులు ఎందుకు అర్థం చేసుకోలేకపోతారు! ఎందుకంటే ఆత్మ తమోప్రధానముగా అయిపోయింది, దానినే రాతిబుద్ధి అని అంటారు. ఎవరైతే భారత్ ను స్వర్గముగా తయారుచేసారో, పూజ్యముగా తయారుచేసారో వారినే మళ్ళీ పూజారిగా అయి గ్లాని చేస్తారు. ఇందులో కూడా ఎవరి దోషము లేదు. ఈ డ్రామా ఎలా తయారుచేయబడి ఉంది, పూజ్యుల నుండి పూజారులుగా ఎలా అయ్యారు అనేది తండ్రి పిల్లలకు అర్థం చేయిస్తారు. నేటికి 5,000 సంవత్సరాల క్రితం భారత్ లో ఆది సనాతన దేవీ-దేవతా ధర్మం ఉండేది, ఇది నిన్నటి విషయమే అని తండ్రి అర్థం చేయిస్తారు. కానీ మనుష్యులు పూర్తిగా మర్చిపోయారు. ఈ శాస్త్రాలు మొదలైనవాటన్నింటినీ భక్తి మార్గం కొరకు తయారుచేసారు. శాస్త్రాలు ఉన్నది భక్తి మార్గం కొరకే, అంతేకానీ జ్ఞాన మార్గం కొరకు కాదు. జ్ఞానమార్గపు శాస్త్రాలు అసలు తయారవ్వనే తయారవ్వవు. తండ్రియే కల్ప-కల్పమూ వచ్చి దేవతా పదవి కొరకు పిల్లలకు జ్ఞానాన్ని ఇస్తారు. తండ్రి చదువును చదివిస్తారు, ఆ తర్వాత ఈ జ్ఞానం కనుమరుగైపోతుంది. సత్యయుగములో ఏ శాస్త్రమూ ఉండదు ఎందుకంటే అది జ్ఞానమార్గపు ప్రారబ్ధము. 21 జన్మల కొరకు అనంతమైన తండ్రి నుండి అనంతమైన వారసత్వం లభిస్తుంది, ఆ తర్వాత మళ్ళీ అల్పకాలం కొరకు రావణుని వారసత్వం లభిస్తుంది, దానిని సన్యాసులు కాకిరెట్టతో సమానమైన సుఖము అని అంటారు. అంతా దుఃఖమే దుఃఖము ఉంది, దీని పేరే దుఃఖధామము. కలియుగానికి ముందు ద్వాపరము ఉంది, దానిని సెమీ-దుఃఖధామము అని అంటారు. ఇది ఫైనల్ దుఃఖధామము. ఆత్మయే 84 జన్మలు తీసుకుంటుంది, కిందకు దిగజారుతుంది. తండ్రి మెట్లు పైకి ఎక్కిస్తారు ఎందుకంటే చక్రము తప్పకుండా తిరగాలి. కొత్త ప్రపంచం ఉండేది, దేవీ-దేవతల రాజ్యం ఉండేది. అప్పుడు దుఃఖము యొక్క నామ-రూపాలు ఉండేవి కావు, అందుకే పులి, మేక కలిసి నీరు తాగుతాయి అన్నట్లుగా చూపించారు. అక్కడ హింస అనే విషయమేదీ లేదు. అహింసయే పరమ దేవీ-దేవతా ధర్మం అని అంటారు. ఇక్కడ హింస ఉంది. మొట్టమొదటి హింస కామ ఖడ్గాన్ని ఉపయోగించడమే. సత్యయుగములో వికారులు ఎవరూ ఉండరు. వారికైతే మహిమను గానం చేస్తారు. మీరు సంపూర్ణ నిర్వికారులు... అని లక్ష్మీ-నారాయణులకు మహిమను గానం చేస్తారు కదా. ఈ కలియుగము ఇనుపయుగ ప్రపంచము, దీనిని ఎవరూ

బంగారుయుగము అని అనలేరు. డ్రామాయే ఈ విధంగా తయారుచేయబడి ఉంది. సత్యయుగము శివాలయము. అక్కడ అందరూ పావనులుగా ఉంటారు, వారి చిత్రాలు కూడా ఉన్నాయి. శివాలయాన్ని తయారుచేసే శివబాబా చిత్రము కూడా ఉంది. భక్తి మార్గములో వారికి ఎన్నో పేర్లను పెట్టేసారు. వాస్తవానికి వారి పేరు ఒక్కటే. తండ్రికి తమ శరీరమైతే లేదు. నేను నా పరిచయాన్ని ఇవ్వడానికి మరియు రచన యొక్క ఆదిమధ్యాంతాల జ్ఞానాన్ని వినిపించడానికి రావలసి ఉంటుంది. నేను వచ్చి మీ సేవ చేయవలసి ఉంటుంది. మీరే నన్ను - ఓ పతిత పావనా రండి అని పిలుస్తారు. సత్యయుగములో అలా పిలవరు. ఈ సమయంలో అందరూ పిలుస్తారు ఎందుకంటే వినాశనం ఎదురుగా ఉంది. ఇది ఆ మహాభారత యుద్ధమేనని భారతవాసులకు తెలుసు, మళ్ళీ ఆది సనాతన దేవీ-దేవతా ధర్మము యొక్క స్థాపన జరుగుతుంది. నేను రాజులకే రాజులుగా తయారుచేయడానికి వచ్చాను అని తండ్రి కూడా అంటారు. ఈ రోజుల్లోనైతే మహారాజులు, చక్రవర్తులు మొదలైనవారు లేరు. ఇప్పుడైతే ప్రజలపై ప్రజల రాజ్యం ఉంది. భారతవాసులమైన మనము సుసంపన్నులుగా ఉండేవారము, వజ్ర-వైఢూర్యాలతో నిర్మితమైన మహళ్ళలో ఉండేవారము అని పిల్లలు భావిస్తారు. కొత్త ప్రపంచము ఉండేది, మళ్ళీ కొత్తదే పాతగా అయ్యింది. ప్రతి వస్తువూ పాతదిగా తప్పకుండా అవుతుంది. ఇల్లును కొత్తగా నిర్మిస్తారు, మళ్ళీ చివరికి దాని ఆయువు తగ్గిపోతూ ఉంటుంది. ఇది కొత్తది, ఇది సగం పాతది, ఇది మధ్యమము అన్నట్లు చెప్తారు. ప్రతి వస్తువు సతో, రజో, తమోగా అవుతుంది. భగవానువాచ ఉంది కదా. భగవంతుడు అంటే భగవంతుడే. భగవంతుడు అని ఎవరిని అంటారో కూడా తెలియదు. రాజులు, రాణులు అయితే లేరు. ఇక్కడైతే ప్రెసిడెంట్, ప్రైమ్ మినిస్టర్ మరియు వారి ఎంతోమంది మినిస్టర్లు... ఉన్నారు. సత్యయుగములో యథా రాజా రాణి, తథా ప్రజా ఉంటారు. తేడానైతే తండ్రి తెలియజేసారు. సత్యయుగములో ఎవరైతే యజమానులుగా ఉంటారో, వారికి మంత్రులు, సలహాదారులు ఉండరు. అవసరమే లేదు. ఈ సమయంలోనే శివబాబా నుండి శక్తిని ప్రాప్తి చేసుకుని ఆ పదవిని పొందుతారు. ఈ సమయంలో తండ్రి నుండి ఉన్నతమైన సలహా లభిస్తుంది, దాని ద్వారా ఉన్నత పదవిని పొందుతారు, ఇక ఆ తర్వాత ఎవరి నుండీ సలహాను తీసుకోరు. అక్కడ మంత్రులు ఉండరు. ఎప్పుడైతే వామమార్గంలోకి వెళ్ళారో, అప్పుడే మంత్రులు ఉంటారు, వారి తెలివి సమాప్తమైపోతుంది.

వికారాల విషయమే ముఖ్యమైనది. దేహాభిమానం ద్వారానే వికారాలు ఉత్పన్నమవుతాయి. వాటిలో కామము నంబర్ వన్. ఈ కామము మహాశత్రువు, దానిపై విజయాన్ని పొందాలి అని తండ్రి అంటారు. స్వయాన్ని ఆత్మగా భావించండి అని తండ్రి ఎన్నో సార్లు అర్థం చేయించారు. మంచి లేక చెడు సంస్కారాలు ఆత్మలోనే ఉంటాయి. ఇక్కడే కర్మలకు పశ్చాత్తాప పడవలసి ఉంటుంది, సత్యయుగములో అలా ఉండదు. అది సుఖధామము. తండ్రి వచ్చి పిల్లలైన మిమ్మల్ని సుఖధామవాసులుగా, శాంతిధామవాసులుగా చేస్తారు. తండ్రి డైరెక్టుగా ఆత్మలతో మాట్లాడుతారు. వారు అందరికీ చెప్తారు - ఓ ఆత్మా, నిశ్చయబుద్ధిగా అయి కూర్చో, దేహాభిమానాన్ని వదులు, ఈ దేహము వినాశీ, నీవు అవినాశీ ఆత్మవు. ఈ జ్ఞానము ఇంకెవ్వరిలోనూ లేదు. జ్ఞానాన్ని గురించి తెలియని కారణంగా భక్తినే జ్ఞానముగా భావించారు. భక్తి వేరని, జ్ఞానం ద్వారానే సద్గతి లభిస్తుందని ఇప్పుడు పిల్లలైన మీరు అర్థం చేసుకున్నారు. భక్తి సుఖము అల్పకాలికముగా ఉంటుంది ఎందుకంటే పాపాత్ములుగా అయిపోతారు, వికారాలలోకి వెళ్ళిపోతారు. అర్ధకల్పం కొరకు అనంతమైన వారసత్వం లభించింది, అది పూర్తయిపోయింది. ఇప్పుడు మళ్ళీ తండ్రి వారసత్వాన్ని ఇవ్వడానికి వచ్చారు, అందులో పవిత్రత, సుఖము, శాంతి, అన్నీ లభిస్తాయి. పిల్లలూ, ఈ పాత ప్రపంచమైతే స్మశానవాటికగా తప్పకుండా అవ్వవలసిందేనని మీకు తెలుసు. ఇప్పుడు ఈ స్మశానవాటిక నుండి మనస్సును తొలగించి కొత్త ప్రపంచమైన పరిస్తాన్ పట్ల మమకారాన్ని జోడించండి. ఏ విధముగా లౌకిక తండ్రి కొత్త ఇంటిని నిర్మించినప్పుడు పిల్లల బుద్ధియోగము పాత ఇంటి నుండి తొలగిపోయి కొత్త ఇంటితో జోడింపబడుతుందో, ఆఫీస్ లో కూర్చొని ఉన్నా బుద్ధి కొత్త ఇంటి వైపే ఉంటుందో, అలా అది హద్దులోని విషయమైతే, ఇక్కడ అనంతమైన తండ్రి కొత్త ప్రపంచమైన స్వర్గాన్ని రచిస్తున్నారు. ఇప్పుడు పాత ప్రపంచం నుండి సంబంధాన్ని తెంచి తండ్రినైన నా ఒక్కరితోనే జోడించండి అని చెప్తున్నారు. మీ కొరకు కొత్త ప్రపంచమైన స్వర్గాన్ని స్థాపించడానికి వచ్చాను. ఇప్పుడు ఈ పాత ప్రపంచమంతా ఈ రుద్ర జ్ఞాన యజ్ఞములో స్వాహా అవ్వనున్నది. ఈ మొత్తం వృక్షమంతా తమోప్రధానముగా అయిపోయింది, శిథిలావస్థకు చేరుకుంది, ఇప్పుడు మళ్ళీ కొత్తదిగా అవుతుంది. కావున ఇవి కొత్త ప్రపంచ విషయాలు అని తండ్రి అర్థం చేయిస్తారు. మనుష్యులు రోగములో కూడా హోప్ లెస్ గా (నిరాశాజనకముగా) అయిపోతారు కదా. ఫలానావారు బతకడం కష్టం అని భావిస్తారు. అలాగే ఈ ప్రపంచం కూడా ఇప్పుడు హోప్ లెస్ గా (నిరాశాజనకముగా, ఎటువంటి ఆశా లేకుండా) అయిపోయింది. ఇప్పుడిది స్మశానవాటికగా అవ్వనున్నది, కావున ఇక దీనిని స్మృతి ఎందుకు చేయాలి? ఇది అనంతమైన సన్యాసము. ఆ హఠయోగ సన్యాసులు కేవలం ఇళ్ళు-వాకిళ్ళను వదిలి వెళ్ళిపోతారు. మీరైతే మొత్తం పాత ప్రపంచమంతటినీ సన్యసిస్తారు. ఇది పాత ప్రపంచం నుండి కొత్త ప్రపంచంగా

అయిపోతుంది.

తండ్రి అంటారు - నేనైతే వినమ్రుడనైన సేవకుడిని, నేను పిల్లల సేవకై వచ్చాను. బాబా, మేము పతితులుగా అయిపోయాము, మీరు పతిత ప్రపంచములోకి మరియు పతిత శరీరములోకి రండి అని నన్ను పిలిచారు. ఎలాంటి ఆహ్వానాన్ని ఇస్తారో చూడండి! పతితులుగా చేసేది రావణుడు, అతడిని కాలుస్తూ ఉంటారు. అతను చాలా కఠినమైన శత్రువు. ఎప్పటి నుండైతే ఈ రావణుడు వచ్చాడో, అప్పటి నుండి మీకు ఆదిమధ్యాంతమూ దుఃఖము లభించింది. విషయసాగరములో మునకలు వేస్తూ ఉంటారు. ఇప్పుడు ఇక విషాన్ని వదిలి జ్ఞానామృతాన్ని త్రాగండి అని తండ్రి అంటారు. అర్ధకల్పం రావణరాజ్యంలో మీరు వికారాల కారణముగా ఎంత దుఃఖితులుగా అయిపోయారు. మీరు ఎంత నిర్లక్ష్యులుగా, పెర్రివారిలా అయిపోతారంటే ఇక నచ్చినట్లుగా నిందించడం మొదలుపెడతారు. అది కూడా ఎంతగా నిందిస్తారంటే, విచిత్రంగా చేస్తారంటే - ఎవరైతే మిమ్మల్ని పావనంగా, విశ్వాధిపతులుగా తయారుచేస్తారో వారిని అందరికంటే ఎక్కువగా నిందిస్తారు. మనుష్యుల గురించి అయితే 84 లక్షల యోనులు అని అంటారు మరియు నన్ను సర్వవ్యాపి అని అనేస్తారు. ఇది కూడా డ్రామాయే. తండ్రి ఇలా మీకు సరదాగా అర్థం చేయిస్తున్నారు. మంచి లేక చెడు స్వభావ-సంస్కారాలు ఆత్మకే ఉంటాయి. నేను 84 జన్మలను అనుభవిస్తాను అని ఆత్మ అంటుంది. ఆత్మయే ఒక శరీరాన్ని వదిలి మరొకటి తీసుకుంటుంది. ఈ విషయాన్ని కూడా ఇప్పుడు తండ్రి అర్థం చేయించారు. డ్రామా ప్లాన్ అనుసారంగా మళ్ళీ తండ్రియే వచ్చి ఎవరైతే తలకిందులుగా అయిపోయారో వారిని సరి చేస్తారు. మధురాతి మధురమైన పిల్లలకు తండ్రి అర్థం చేయిస్తారు - ఇక్కడ మీరు తలకిందులుగా కూర్చోకండి, స్వయాన్ని ఆత్మగా భావించండి. ఇప్పుడు మీకు మిమ్మల్ని సరి చేసే అల్లా అయిన తండ్రి లభించారు. రావణుడు తలకిందులుగా చేస్తాడు, మళ్ళీ సరి అవ్వడంతో మీరు లేచి నిలబడతారు. ఇది ఒక నాటకము. ఈ జ్ఞానాన్ని తండ్రే కూర్చొని తెలియజేస్తారు. భక్తి భక్తే, జ్ఞానం జ్ఞానమే. భక్తి పూర్తిగా వేరు. ఒక సరస్సు ఉండేది, అందులో స్నానం చేయడం ద్వారా దేవకన్యలుగా అయిపోతారు అని చెప్తారు. మళ్ళీ పార్వతికి అమరకథను వినిపించారు అని అంటారు. ఇప్పుడు మీరు అమరకథను వింటున్నారు కదా. కేవలం ఒక్క పార్వతికే అమరకథను వినిపించారా! ఇది ఎంతోమంది విషయము. అమరలోకము సత్యయుగము, మృత్యులోకము కలియుగము. దీనిని ముళ్ళ అడవి అని అంటారు. తండ్రి గురించి తెలియనే తెలియదు. పరమపిత పరమాత్మా, ఓ భగవంతుడా అని అంటారు కానీ తెలియదు. మీకు కూడా ఇంతకుముందు తెలియదు. మిమ్మల్ని తండ్రే వచ్చి సరిచేసారు. భగవంతుడిని అల్లా అని అంటారు. అల్లా చదివించి, అల్లా పదవిని ఇస్తారు కదా. కానీ భగవంతుడు ఒక్కరే. ఈ లక్ష్మీ-నారాయణులను భగవాన్, భగవతి అని అనరు. వీరు పునర్జన్మలలోకి వస్తారు కదా. నేనే వీరిని చదివించి దైవీ గుణాలు కలవారిగా తయారుచేసాను.

మీరందరూ సోదరులు. తండ్రి వారసత్వానికి హక్కుదారులు. మనుష్యులైతే ఘోర అంధకారంలో ఉన్నారు. అసురీ సాంప్రదాయం కదా. కలియుగం ఇప్పుడు ఇంకా (చిన్న పిల్లలు మోకాళ్ళపై నడిచినట్లు) అంబాడుతూ ఉంది అని అంటారు. ఇప్పుడు ఇంకా ఎన్నో సంవత్సరాలు ఉన్నాయి అని అనుకుంటారు. ఎంతటి అజ్ఞాన అంధకారంలో నిదురిస్తున్నారు. ఇది కూడా ఒక ఆటయే. ప్రకాశములో దుఃఖము ఉండదు, అంధకారంలో రాత్రివేళలో దుఃఖము ఉంటుంది. ఇది కూడా మీరే అర్థం చేసుకుంటారు మరియు అర్థం చేయించగలరు. మొట్టమొదట ప్రతి మానవమాత్రునికి తండ్రి పరిచయాన్ని ఇవ్వాలి. ఇద్దరు తండ్రులైతే అందరికీ ఉంటారు. హద్దు తండ్రి హద్దు సుఖాన్ని ఇస్తారు, అనంతమైన తండ్రి అనంతమైన సుఖాన్నే ఇస్తారు. శివరాత్రిని జరుపుకుంటున్నారంటే మరి తప్పకుండా తండ్రి స్వర్గస్థాపన చేయడానికి వస్తారు కదా. ఏ స్వర్గమైతే గతించిపోయిందో దానిని మళ్ళీ స్థాపన చేస్తున్నారు. ఇప్పుడు ఇది తమోప్రధానమైన ప్రపంచము, నరకము. డ్రామా ప్లాన్ అనుసారంగా ఎప్పుడైతే ఏక్యురేట్ సమయం వస్తుందో అప్పుడు మళ్ళీ నేను వచ్చి నా పాత్రను అభినయిస్తాను. నేను నిరాకారుడిని, నాకు నోరైతే తప్పకుండా కావాలి. ఎద్దు ముఖము అయితే ఉండదు కదా. నేను ఇతనెవరైతే అనేక జన్మల అంతిమ జన్మలోని వానప్రస్థావస్థలో ఉన్నారో, అతని నోరును ఉపయోగించుకుంటాను, ఇతనిలోకి ప్రవేశిస్తాను, ఇతనికి తన జన్మల గురించి తెలియదు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఏ విధంగా తండ్రి డైరెక్టుగా ఆత్మలతో మాట్లాడుతారో, అలాగే స్వయాన్ని ఆత్మగా నిశ్చయం చేసుకోవాలి. ఈ

స్మశానవాటిక నుండి మమకారాన్ని తొలగించివేయాలి. ఎటువంటి సంస్కారాలను ధారణ చేయాలంటే, ఇక వాటి వలన ఎప్పుడూ కర్మలకు పశ్చాత్తాప పడవలసి అవసరం రాకూడదు.

2. ఏ విధంగా తండ్రి డ్రామా విషయంలో స్థిరంగా ఉన్న కారణంగా ఎవరిపైనా దోషమును మోపరో, నిందించే అపకారులపై కూడా ఉపకారం చేస్తారో, అదే విధంగా తండ్రి సమానంగా అవ్వాలి. ఈ డ్రామాలో ఎవ్వరి దోషమూ లేదు, ఇది ఏక్యురేట్ గా తయారుచేయబడి ఉంది.

వరదానము:- ప్రతి అడుగులో వరదాత నుండి వరదానాలను ప్రాప్తి చేసుకుని శ్రమ నుండి ముక్తులుగా ఉండే అధికారీ ఆత్మా భవ

ఎవరైతే వరదాత పిల్లలుగా ఉన్నారో, వారికి ప్రతి అడుగులో వరదాత నుండి వరదానాలు స్వతహాగానే లభిస్తాయి. వరదానాలే వారి పాలన. వారు వరదానాల పాలనతోనే పాలింపబడతారు. ఎటువంటి శ్రమ లేకుండా ఇన్ని శ్రేష్ఠ ప్రాప్తులు లభించటము - దీనినే వరదానము అని అంటారు. కావున జన్మజన్మలకు ప్రాప్తికి అధికారులుగా అయిపోయారు. ప్రతి అడుగులో వరదాత యొక్క వరదానము లభిస్తుంది మరియు సదా లభిస్తూనే ఉంటుంది. అధికారీ ఆత్మకు దృష్టి ద్వారా, మాటల ద్వారా, సంబంధము ద్వారా వరదానాలే వరదానాలు లభిస్తూ ఉంటాయి.

స్లోగన్:- సమయము యొక్క వేగము అనుసారంగా పురుషార్థపు వేగాన్ని తీవ్రతరం చెయ్యండి.